క్లుప్తంగా

క్రీడాకారులకు పోటీతత్వం అవసరం

పిడుగురాళ్ల: క్రీడాకారులకు పోటీతత్వం అవసరమని విద్యార్థి జూనియర్ కాలేజీ డైరెక్టర్ ఎం.సురేష్‌కుమార్ చెప్పారు. పట్టణంలోని స్కాలర్ డిగ్రీ కాలేజీలో భారత వనిత వార పత్రిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి కార్క్‌బాల్ క్రికెట్ పోటీల ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ రాబోయే రోజుల్లో మరింత మంది పల్నాడు ప్రాంతం నుంచి క్రీడాకారులుగా ఎదగాలని ఆకాంక్షిస్తున్నట్లు వివరించారు. ఇప్పటికే క్రేజీబాయ్స్, ఎస్ఎస్ జట్లు ఫైనల్‌కు వెళ్లగా.. మూడో స్థానం కోసం గురువారం పోటీ నిర్వహించారు. పూర్ణ సీసీ, జూనపాడు గణేష్ సీసీ తలపడ్డాయి. పూర్ణ సీసీ టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుని నిర్ణీత 15 ఓవర్లలో 13 ఓవర్లు ఆడి 80 పరుగులు చేసింది. గణేష్ సీసీ నాలుగు వికెట్లు నష్టపోయి 12.4 ఓవర్లలో 84 పరుగులు చేసి విజయం సాధించింది. కార్యక్రమంలో వనిత శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, మురళీ, నిరంజన్, నాయక్, రత్నం, రవి, బాబు, గఫూర్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీపై అవగాహన అవసరం

మాచవరం: హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన అవసరమని లింక్ వర్కర్స్ స్కీమ్ జోన్-2 సూపర్‌వైజర్ విశ్వేశ్వరావు చెప్పారు. మల్లవోలు గ్రామంలోని వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లో ఏపీఎస్ఏసీఎస్, చైల్డ్ ఫండ్ ఇండియా, లింక్ వర్కర్ స్కీమ్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. హెచ్ఐవీ దుష్పరిణామాలు, ఎయిడ్స్ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

ఎయిడ్స్ అంటించుకునే వ్యాధి

గురజాల : ఎయిడ్స్ అంటువ్యాధి కాదని, అంటించుకునే వ్యాధి అని ఐసీటీసీ కౌన్సిలర్ వెంకయ్య చెప్పారు. నగర పంచాయతీ పరిధిలోని జంగమహేశ్వరపురం గ్రామంలో తిరునాళ్లను పురస్కరించుకుని గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. సుఖవ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని వివరించారు. కండోమ్ వాడకం, ప్రయోజనాలపై వివరించారు. ఎయిడ్స్ బాధితుల సంక్షేమానికి వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని, హైరిస్క్ బాధితులకు ఉచితంగా మందులతో పాటు పౌష్టికాహారం అందిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో లింక్ జోనల్ సూపర్‌వైజర్ విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తపాలా సేవలు వినియోగించుకోవాలి



గురజాల : తపాలా సేవలను వినియోగించుకోవాలని నరసరావుపేట పోస్టల్ సూపరింటెండెంట్ వెంకటస్వామి సూచించారు. నగర పంచాయతీ పరిధిలోని జంగమహేశ్వరపురంలో పోస్టల్ సేవలపై గురువారం తపాలా మహా మేళా నిర్వహించారు. తపాలా పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో మాచర్ల పోస్టల్ ఇన్‌స్పెక్టర్ పరశురాం, జంగమహేశ్వరపురం బ్రాంచి పోస్టు మాస్టర్ దీకొండ రామమూర్తి, గురజాల పోస్టల్ ఇన్‌స్పెక్టర్ టి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎడ్ల పందేలు సంప్రదాయాలకు ప్రతీక

గురజాల : ఎడ్ల బండ లాగుడు పోటీలు సంస్కృతిసంప్రదాయాలకు ప్రతీక అని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి చెప్పారు. నగర పంచాయతీలోని జంగమహేశ్వరపురంలో శ్రీ వేంకటేశ్వర స్వామి తిరునాళ్లను పురస్కరించుకుని యెనుముల మురళీధర్‌రెడ్డి, గ్రామ రైతు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఎద్దుల బండ లాగుడు పోటీలను గురువారం రాత్రి ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే గురజాలలోని డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి యెనుముల మురళీధర్‌రెడ్డి, సీనియర్ నాయకుడు కొమ్మినేని వెంకటేశ్వర్లు (కేవీ), నగర పంచాయతీ చైర్ పర్సన్ పోలు పవన్మయి వీరారెడ్డి, వైస్ చైర్మన్‌లు షేక్ బడేజానీ, మన్నెం కన్యాకుమారి ప్రసాద్, మండల కన్వీనర్ గాంధీ, పట్టణ కన్వీనర్ కె అన్నారావు, ఎంపీపీ కొమ్మినేని నారాయణమ్మ బుజ్జి, వైస్ ఎంపీపీ వేముల శేషమ్మ చలమయ్య, మండల కో-ఆప్షన్ సభ్యులు పీర్ అహ్మద్, పౌరసరఫరాల శాఖ డైరెక్టర్ కె.ప్రగతి కోటేశ్వరరావు, మార్కెట్ యార్డు చైర్మన్ కలకండ అంద్రెయ్య, బాసిరెడ్డి ఇష్టకామిరెడ్డి, వీరంరెడ్డి అమరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

1న చైతన్య గోదావరి బ్రాంచ్ ప్రారంభోత్సవం

శావల్యాపురం: మండలంలోని కారుమంచి గ్రామంలో (మార్చి) వచ్చే నెల 1వ తేదీన ఉదయం 10 గంటలకు చైతన్య గోదావరి గ్రామీణ నూతన బ్యాంకు శాఖను ప్రారంభోత్సవం చేస్తున్నట్లు శావల్యాపురం బ్రాంచ్ శాఖ మేనేజరు ఇలింద్రపర్తి విశ్వనాథ్ గురువారం తెలిపారు. శాసనసభ్యు లు బొల్లా బ్రహ్మనాయుడు, బ్యాంకు చైర్మన్ టి.కామేశ్వరరావు, నరసరావుపేట రీజనల్ మేనేజరు మారుతీరామ్ సారథ్యంలో నూతన బ్రాంచ్ ప్రారంభోత్సరం జరుగుతుందన్నారు. కావూరి సాయిచంద్రచౌదరి బ్రాంచి మేనేజరుగా నియామకమైనట్లు చెప్పారు.

సేద్యం.. సంబరం

- నీరు పుష్కలం
- పల్నాడు ప్రాంతంలో రబీ సాగుకు సై
- ఉత్సాహంగా సాగుతున్న కర్షకులు



గురజాలలో వరినాట్లు వేస్తున్న దృశ్యం

గురజాల : పల్నాడు ప్రాంతంలో రబీ వరి సాగు చేపట్టేందుకు అన్నదాతలు ఆసక్తి చూపుతున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రెండో పంట వేసేందుకు ఉత్సాహంగా ముందుకు కదులుతున్నారు. ఈ ప్రాంతంలో రబీ సాగుకు అన్నదాతలు సిద్ధమవుతున్నారంటే పూర్తిగా అనుకూల పరిస్థితులు ఉన్నాయని అర్థం. గతంలో ఇక్కడ ఖరీఫ్ సాగు చేయడమే కష్టంగా ఉండేది. సాగునీరు అందేది కాదు. అందుకే అప్పట్లో మొట్ట (పత్తి, మిరప) పంటల సాగుకు మాత్రమే రైతులు ఆసక్తి చూపేవారు. అయితే మూడేళ్లుగా సమృద్ధిగా వర్షాలు కురవడంతో జలాశయాలు, కాలువల్లో పుష్కలంగా నిల్వలు ఉన్నాయి. దీనికి తోడు భూగర్భ జలాలు మెరుగుపడ్డాయి. దీంతో రైతులు ఆనందంగా వరి సాగుకు సిద్ధమవుతున్నారు. అంతేగాక ఖరీఫ్‌లో దిగుబడులు ఆశాజనకంగా రావడం, ప్రభుత్వం సాగుకు అన్ని రకాలుగా సాయం చేస్తుండడం, పంట ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించడం అన్నదాతల ఉత్సాహానికి కారణంగా తెలుస్తోంది. కర్షకులు ప్రస్తుతం రబీ పనుల్లో బిజీగా ఉన్నారు. కాలువల ద్వారా నీరు వస్తుడంటంతో పొలాలను దమ్ముచేసి నాట్లు వేస్తున్నారు.

ఇప్పటివరకు గురజాల నియోజకవర్గంలో రబీ వరి నాట్లు ఇలా..(ఎకరాల్లో)

మండలం	సాగు లక్ష్యం	నాట్లు వేసింది
గురజాల	4,805	4,756
దాచేపల్లి	191	95.61
కారంపూడి	2832	2116
మాచవరం	241	88.5
పిడుగురాళ్ల	1,381	1,124
నకరికల్లు	4,721	4,549

ఖరీఫ్‌లో మంచి లాభాలు

కాలువల్లో నీరు పుష్కలంగా ఉంది. దీంతో రైతులు రబీ సాగుకు ఉత్సాహం చూపుతున్నారు. ఖరీఫ్ సాగులో రైతులకు మంచి లాభాలు వచ్చాయి. వ్యవసాయాధికారుల సలహాలు తీసుకుని రైతులు ముందుకు వెళ్తే రబీలోనూ మంచి దిగుబడులు వస్తాయి. ప్రభుత్వం అన్నివిధాలా సాయం అందించేందుకు సిద్ధంగా ఉంది.

శ్రీకృష్ణదేవరాయులు,
ఏడీఏ, పిడుగురాళ్ల

జగనన్న అందరివాడు

- అన్నివర్గాలకూ అండ
- ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి
- జమ్మలమడకలో గడప గడపకు మన ప్రభుత్వం



జమ్మలమడకలో పీఆర్కేను గజమాలతో సత్కరిస్తున్న దృశ్యం

మాచర్ల రూరల్: రాష్ట్రంలో అన్నివర్గాలకూ ఆర్థిక భరోసా కల్పిస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందరివాడిగా నిలిచారని వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షులు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి చెప్పారు. గురువారం అమ్మాని జమ్మలమడక గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న అనేక సంక్షేమ పథకాలకు ప్రజలందరూ మద్దతు తెలిపి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే కోరారు. అర్హతే ప్రమాణంగా పార్టీలు, వర్గాలు, కులాలను సైతం చూడకుండా ప్రభుత్వ పథకాలను అందిస్తున్న ఘనత జగనన్నదేనన్నారు. గ్రామాలలో సచివాలయాలను ఏర్పాటు చేసి చెంతకు పాలనను తెచ్చిన సీఎం జగన్‌కు అందరం అండగా నిలబడాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దుతున్న ప్రభుత్వమిదన్నారు. వైఎస్సార్ క్లినిక్‌ల ద్వారా ఆరోగ్యం, రైతు భరోసా కేంద్రాల ద్వారా కర్షకులకు సేవలందించడం భేష్ అని పేర్కొన్నారు. గ్రామానికి వచ్చిన పీఆర్కేకు ప్రజలు ఘనస్వాగతం పలికారు. భారీ గజమాలతో సత్కరించారు. మహిళలు హారతులు పట్టి, దిష్టి తీశారు. యువకులు జై జగన్, జై పీఆర్కే అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బూడిద శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పెదమల్లు స్వామి, వైస్ ఎంపీపీ పోతురెడ్డి సుజాత కోటిరెడ్డి, మాచర్ల మున్సిపల్ చైర్మన్ బోయ రఘురామిరెడ్డి, సర్పంచ్ ముక్కా చౌడయ్య, వడితె అంజమ్మ, సొసైటీ చైర్మన్ గుత్తికొండ సత్యనారాయణరెడ్డి, ఎంపీటీసీ పరిమళ ఏసోబు, యార్డు డైరెక్టర్ లక్ష్మయ్య, నాయకులు తిప్పారెడ్డి గోపాల్‌రెడ్డి, గొబ్బూరి ఆదెయ్య, ముక్కా గురవయ్య, మాజీ ఎంపీపీ పేర్ల మల్లయ్య, కూరబోయిన పెద అప్పయ్య, డ్రైవర్ అంజి, పచ్చిపాల కొండ, కె బసవ నాగేశ్వరరావు, జల్లెల కోటేశ్వరరావు, కూరబోయిన స్టార్ శ్రీను, వడితె బాబునాయక్, మున్నా రామకృష్ణ, దుర్గెంపూడి సీతారామిరెడ్డి, బ్రహ్మారెడ్డి, శ్రీనివాసరెడ్డి, వీర్ల శ్రీనివాస్, గంగనబోయిన లక్ష్మయ్య, మల్లెల శ్రీనివాసరావు, కౌన్సిలర్లు రామిశెట్టి వెంకటేశ్వర్లు, పోలా శ్రీనివాసరావు, తిప్పారెడ్డి పోలిరెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

ప్రతివార్డునూ అభివృద్ధి చేస్తాం

మున్సిపల్ చైర్మన్ బోయ రఘురామిరెడ్డి



అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

మాచర్ల: పట్టణంలోని ప్రతి వార్డునూ అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో చర్యలు తీసుకుని వివిధ పనులు చేపడతామని మున్సిపల్ చైర్మన్ బోయ రఘురామిరెడ్డి చెప్పారు. గురువారం 29వ వార్డులో కాల్వ నిర్మాణ పనులకు చైర్మన్ బోయ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని అన్ని వార్డులలో మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. అనంతరం వివిధ పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ జలీల్, కౌన్సిలర్ షేక్ సుభాని, మున్సిపల్ కమిషనర్ రమణబాబు, డీఈ జి.నాగభూషణం, ఏఈ సామ్యేల్ తదితరులు పాల్గొన్నారు.

వధువులకు కల్యాణ కానుక



మాచవరంలో కల్యాణ కానుక అందజేస్తున్న అశోక్‌కుమార్ తదితరులు

మాచవరం: సంప్రదాయాలను గౌరవిస్తూ కులమతాలకు అతీతంగా నిరుపేద వధువులకు కల్యాణ కానుక అందజేస్తున్నట్లు చింతలపూడి చారిటబుల్ ట్రస్టు చైర్మన్ చింతలపూడి శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని వేమవరం, మాచవరం గ్రామాల్లోని సయ్యద్ ఆయుషా, షేక్ షాహిదా అనే వధువులకు బంగారు ఉంగరం, చీర, సారెలను పల్నాడు హాస్పిటల్ అధినేత చింతలపూడి అశోక్‌కుమార్ గురువారం అందజేశారు. ఆయన మాట్లాడుతూ హలో నేస్తం (మన ఆడబిడ్డ- మన భాద్యత) కార్యక్రమంలో భాగంగా నూతన వధువులకు కల్యాణ కానుకలు అందజేసినట్లు వివరించారు.

ఆర్టీసీ అభివృద్ధికి కృషి



ఆర్టీసీ ఎండీ ద్వారకాతిరుమలరావుకు సమస్యలు వివరిస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



బుద్ధుని పాదాల వద్ద పుష్పాంజలి ఘటిస్తున్న ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ ద్వారకాతిరుమలరావు

- ఆర్టీసీ ఎండీ ద్వారకాతిరుమలరావు
- పలు బస్సు సర్వీసుల కోసం ఎమ్మెల్యే కాసు వినతి

పిడుగురాళ్ల: ఆర్టీసీ అభివృద్ధికి కృషి చేస్తామని ఆర్టీసీ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ సీహెచ్ ద్వారకాతిరుమలరావు చెప్పారు. పట్టణంలోని ఆర్టీసీ డిపోను గురువారం ఆయన సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మాచర్ల, పిడుగురాళ్ల డిపోలను, దాచేపల్లి, రెంటచింతల, గురజాల బస్టాండ్‌లను పరిశీలించానని, సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతానని చెప్పారు. పిడుగురాళ్లలో ప్లాట్‌ఫాం సరిచేయాలని ప్రయాణికులు విన్నవించారని చెప్పారు. గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి మాట్లాడుతూ ఆర్టీసీని పటిష్ట పరచాలని, తిరుపతి, శ్రీశైలం, హైదరాబాద్, ఒంగోలుకు రెగ్యులర్ సర్వీసులు నడిపేలా చర్యలు తీసుకోవాలని ఎండీకి విన్నవించారు. దీనికి ద్వారకాతిరుమలరావు సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కత్తెరపు రాంగోపాల్‌రెడ్డి, అల్లు పిచ్చిరెడ్డి, గొట్టుముక్కల పవన్‌రెడ్డి, మార్కెట్ యార్డు డైరెక్టర్ చీదేళ్ల కృష్ణ, కౌన్సిలర్లు ఉప్పు వెంకటేశ్వర్లు, సైదావలి, ఈడీవో బ్రహ్మానందరెడ్డి, ఈడీ నెల్లూరు జోన్ ఆదాం సాహెబ్, నర్సరావుపేట డీపీటీవో శ్రీనివాసరావు, సీఎంఈ నర్రా శ్రీనివాసరావు, పిడుగురాళ్ల డిపో మేనేజర్ ముక్తేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బుద్ధవనం సందర్శన

విజయపురిసౌత్: నాగార్జున సాగర్‌లోని బుద్ధవనాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ సి.హెచ్.ద్వారకాతిరుమలరావు గురువారం సందర్శించారు. ఆయనకు సిబ్బంది ఘన స్వాగతం పలికారు. తొలుత ఆయన బుద్ధుని పాదాల వద్ద పుష్పాంజలి ఘటించారు. ధ్యానవనం జాతకపార్కు, స్థూప పార్కులను సందర్శించారు. ధ్యాన మందిరంలోని ఆకాశ నిర్మాణ సౌందర్యాన్ని వీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బుద్ధవనం సందర్శన మంచి అనుభూతినిచ్చిందని ఆనందం వ్యక్తం చేశారు. బుద్ధవనం ప్రత్యేకాధికారి మల్లెపల్లి లక్ష్మయ్య కోరిక మేరకు విజయవాడ నుంచి నాగార్జునసాగర్‌కు వారాంతంలో బస్సులను నడుపుతామని పేర్కొన్నారు. ఆర్టీసీ ఎండీకి స్థానిక టూరిజం గైడ్ సత్యనారాయణ బుద్ధవనం నిర్మాణ విశేషాలను వివరించారు. ఆర్టీసీ ఎండీ వెంట ఆర్టీసీ ఈడీ బ్రహ్మానందరెడ్డి, గురజాల డీఎస్పీ మెహర్ జయరాం ప్రసాద్, మాచర్ల సీఐలు సమీముల్లా, బాలకృష్ణ, విజయపురిసౌత్ ఎస్ఐ పి.అనిల్‌కుమార్ రెడ్డి బుద్ధవనం పర్యవేక్షకులు నరసింహారావు ఉన్నారు.

విలువలతో కూడిన విద్యనందిస్తున్నాం



సభలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ చంద్రశేఖర్

దాచేపల్లి : విలువలతో కూడిన విద్యను విద్యార్థులకు అందిస్తున్నామని ప్రిన్సిపాల్ టి.జె.చంద్రశేఖర్ చెప్పారు. నారాయణపురం ప్రభుత్వం జూనియర్ కళాశాల 43వ వార్షికోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జూనియర్ కళాశాలల అభివృద్ధికి కృషి చేస్తోందని, విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తోందని చెప్పారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నతస్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ఈసందర్భంగా విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించేందుకు దాతలు ముందుకు వచ్చారు. వారిని ప్రిన్సిపాల్ సన్మానించారు. అనంతరం విద్యార్థులు ఇచ్చిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సభలో కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ తెలనాకుల సత్యనారాయణ, బుర్రి కృష్ణారెడ్డి, అధ్యాపకులు వెంకటేశ్వర్లు, వెంకటరెడ్డి, రవికుమార్, తిరుపాల్ తదితరులు పాల్గొన్నారు.

పై కప్పు తొలగించి చోరీ

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని ముండ్లమూరు బస్టాండ్ సెంటర్‌లో గల ఓ కిరాణా షాపులో బుధవారం దొంగతనం చోటు చేసుకుంది. ముండ్లమూరు సెంటర్‌లో కిరాణా మర్చంట్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు అచ్యుత మూర్తెయ్య కిరాణా షాపులో పై కప్పు రేకులు తొలగించి సుమారు రూ.50వేలు విలువైన సరుకులను దొంగలు దోచుకెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చిన్నారుల సంరక్షణ అందరి బాధ్యత

రాష్ట్ర చైల్డ్ ప్రొటెక్షన్ కమిషన్ సభ్యులు పద్మావతి



మాట్లాడుతున్న చైల్డ్ ప్రొటెక్షన్ కమిషన్ సభ్యులు పద్మావతి

కారెంపూడి: చిన్నారుల సంరక్షణ అందరి బాధ్యతని, బాలల వికాసానికి తీసుకుంటున్న చర్యల్లో మన రాష్ట్రం దేశంలోనే రెండో స్థానంలో ఉందని స్టేట్ చైల్డ్ ప్రొటెక్షన్ కమిషన్ సభ్యులు బి.పద్మావతి చెప్పారు. తహసీల్దార్ కార్యాలయంలో గురువారం సాయంత్రం సంబంధిత శాఖల అధికారులు, ఉద్యోగులతో ఆమె ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బాలింతలు, చిన్నారుల సంరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. బాల్యవివాహాల నివారణకు అందరూ నడుంబిగించాలని వివరించారు. బడి బయట పిల్లలను తిరిగి పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. అనాథ పిల్లల దత్తతకు ముందుకు రావాలని చెప్పారు. డీసీడీఓ రేవతి, తహసీల్దార్ శ్రీనివాస్, సీఐ జయకుమార్, ఎంఈఓ నాగయ్య పాల్గొన్నారు. అనంతరం పద్మావతి కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు అనేక సమస్యలను ఆమె దృష్టికి తీసుకొచ్చారు. దీంతో పద్మావతి అసంతృప్తి వ్యక్తం చేశారు. తర్వాత ఇందిరానగర్ కాలనీ స్కూల్లో మధ్యాహ్న భోజనం తనిఖీ చేశారు. సగం మంది పిల్లలకు అక్కడ గుడ్లు లేకపోవడాన్ని గమనించి ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రమాదాల నివారణకు చర్యలు చేపడదాం



కార్మికులతో మాట్లాడుతున్న తహసీల్దార్ కట్టెకోట పుల్లారావు

రెంటచింతల: కర్మాగారాలలో విధులు నిర్వహించే సమయంలో అధికారుల సూచనలు, సలహాలు పాటించి ప్రమాదాలను నివారించేందుకు ప్రతి కార్మికుడూ కృషి చేయాలని తహసీల్దార్ కట్టెకోట పుల్లారావు చెప్పారు. గురువారం మండలంలోని సత్రశాల వద్ద ఉన్న పరాశక్తి సిమెంట్ ఫ్యాక్టరీ ఆవరణలో నిర్వహించిన మాక్‌డ్రిల్‌లో ఆయన మాట్లాడారు. అగ్నిప్రమాదాల నివారణకు చర్యలుచేపట్టాలన్నారు. డెప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ గుంటూరు ఎం.వి.శివకుమార్‌రెడ్డి సూచనలు, మార్గదర్శకాల మేరకు ఫ్యాక్టరీలో ఇప్పటి వరకు ఒక్క ప్రమాదం కూడా జరగకుండా చర్యలు తీసుకున్నట్లు సిమెంట్ ప్లాంట్ హెడ్ (వర్క్స్) ఎంఎస్ఎన్ రాజు చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఐ సయ్యద్ షమీర్‌బాషా, పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ నర్రా కృష్ణారెడ్డి, ఫైర్ స్టేషన్ మాచర్ల ఇన్‌చార్జి ఎం.లక్ష్మయ్య, ఆపదమిత్ర దేగల సునీత పాల్గొన్నారు.

నమో వేంకటేశా





జంగమహేశ్వరపురంలో వెంకన్న కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు, తిలకిస్తున్న ప్రజలు

వైభవంగా వెంకన్న కల్యాణోత్సవాలు

గురజాల : నగర పంచాయతీలోని జంగమహేశ్వరపురంలోని అలివేలు మంగా పద్మావతీ సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం గురువారం నేత్రపర్వంగా జరిగింది. పలువురు దంపతులు పీటలపై కూర్చుని కల్యాణ తంతును జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి కల్యాణాన్ని తిలకించి పులకించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. స్వామిని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి యెనుముల మురళీధర్‌రెడ్డి దంపతులు, నగర పంచాయతీ చైర్ పర్సన్ పోలు పవన్మయి వీరారెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు బాసిరెడ్డి ఇష్టకామిరెడ్డి, వీరంరెడ్డి అమరారెడ్డి, పోలు వెంకటరెడ్డి తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పులిపాడులో..

పులిపాడు గ్రామంలోని అలివేలు మంగా పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం గురువారం నేత్రపర్వంగా జరిగింది. స్వామిని ఎంపీపీ కొమ్మినేని నారాయణమ్మ బుజ్జి, సీనియర్ నాయకుడు కొమ్మినేని వెంకటేశ్వర్లు (కేవీ), వైస్ ఎంపీపీ వేముల శేషమ్మ చలమయ్య, గుంటూరు రైల్వే మెంబర్ కె.రవిశంకర్, నాయకులు కావూరి అంజిబాబు తదితరులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పలు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు.

సంక్షేమ పాలనలో అంతా సంతోషం

- పిడుగురాళ్ల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి
- దాచేపల్లి 9వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం



దాచేపల్లి 9వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

దాచేపల్లి : రాష్ట్రంలో సంక్షేమ పాలన కొనసాగుతోందని, ప్రజలంతా సంతోషంగా ఉన్నారని గురజాల శాసన సభ్యుడు కాసు మహేష్‌రెడ్డి చెప్పారు. దాచేపల్లిలోని 9వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కాసు గురువారం చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలకు సంక్షేమ పథకాల గురించి వివరించారు. మూడున్నరేళ్లలో ప్రతి గడపా పొందిన లబ్ధి గురించి చెప్పారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎస్టీ కాలనీలో రూ.10 లక్షలతో నిర్మించనున్న కల్వర్టుకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అనేక సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని వివరించారు. పథకాల అమల్లో దేశానికే రాష్ట్రం ఆదర్శమని చెప్పారు. కాటేరువాగు ఆధునికీకరణ చేపట్టి దాచేపల్లికి ముప్పును తప్పించామని సగర్వంగా ప్రకటించారు. దాచేపల్లి ఎస్టీ కాలనీలోని ప్రతి ఇంటికీ తాగునీరు అందిస్తామని, వీధుల్లో డ్రెయినేజీలు, సిమెంట్ రోడ్లు నిర్మించేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ప్రతిపక్షాల కుట్రలను ప్రజలు తిప్పికొట్టాలని సూచించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సాంబయ్య, వార్డు కౌన్సిలర్లు శ్రీరాం పాలు, ఎంపీపీ కటకం జయశ్రీ, జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు మందపాటి రమేష్‌రెడ్డి, బుర్రి విజయ్‌కుమార్‌రెడ్డి, పార్టీ మండల, పట్టణ కన్వీనర్లు కోట కృష్ణ, షేక్ సుభానీ, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ మునగా నిమ్మయ్య, వైస్ చైర్మన్ షేక్ ఖాదర్ బాషా, వార్డు ఇన్‌చార్జి కుందురు తిరుపతిరెడ్డి, సచివాలయం కన్వీనర్ అంబటి ఆంజనేయులు, మార్కెట్‌యార్డు డైరెక్టర్ యర్రంశెట్టి సైదారావు, నాయకులు కొప్పుల పున్నయ్య, కొప్పుల రవికుమార్, రాయల శ్రీధర్, కొప్పుల రామకృష్ణ, శ్రీరాం పేతురు, వజ్రగిరి మోజేష్, జగన్నాథం కాటయ్య, జగన్నాథం జాన్‌బాబు, దాచేపల్లి సైదారావు, మునగా శ్రీనివాసరావు, కొత్వాల్ సైదా తదితరులు పాల్గొన్నారు.

ఖాతాలో నగదు మాయం

కారెంపూడి: ఖాతాదారుకు తెలీకుండానే ఎకౌంట్‌లో నగదు మాయం అయిన ఘటన గురువారం జరిగింది. బాధితుని కథనం ప్రకారం.. ఒప్పిచర్ల గ్రామానికి చెందిన రైతు కిలారు శ్రీనుకు కారంపూడి యూనియన్ బ్యాంకులో ఖాతా ఉంది. అందులో రూ.74వేల బ్యాలెన్స్ ఉండేది. ఆ మొత్తాన్ని తీసుకునేందుకు శ్రీను గురువారం బ్యాంకుకు రాగా, ఖాతాలో రూ.26వేలు మాత్రమే ఉన్నాయని సిబ్బంది చెప్పారు. దీంతో అవాక్కయిన రైతు బ్యాంకు మేనేజర్‌కు ఫిర్యాదు చేశాడు. విచారణ జరిపి న్యాయం చేస్తామని మేనేజర్ చెప్పారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

నరసరావుపేట టౌన్: రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన గురువారం పట్టణంలో జరిగింది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. బాబాపేట సమీపంలో సుమారు 30 ఏళ్ల వయస్సుగల వ్యక్తి మృతదేహం రైలు పట్టాలపై పడి ఉందని స్థానికుల నుంచి వచ్చిన సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకున్నట్లు ఎస్ఐ టి.సుబ్బారావు తెలిపారు. మృతుడు గోధుమ రంగు చొక్కా, బ్లూకలర్ జీన్స్ ప్యాంట్ ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుడి ఆనవాళ్లు తెలిసిన వారు రైల్వే పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్ఐ కోరారు.

ఉచితంగా భూ సర్వే హద్దురాళ్లు: జేసీ

నరసరావుపేట రూరల్: జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకంలో భాగంగా మండలంలోని దొండపాడులో జరుగుతున్న భూముల రీసర్వే పనులను జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్ శుక్రవారం పరిశీలించారు. గ్రామంలో భూముల రీసర్వే పూర్తికావడంతో ఇప్పటికే రైతులకు పాస్‌బుక్‌లను అందజేశారు. రీ సర్వే అధారంగా గ్రామంలో హద్దురాళ్లు వేసే పనులను చేపట్టారు. పంట భూముల్లో చేపట్టిన హద్దురాళ్లు వేసే పనిని ఆయన పరిశీలించారు. భూ సమస్యలకు తావు లేకుండా పకడ్బందీగా భూముల రీ సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల రీ సర్వేకు ప్రజలు సహకరించాలని కోరారు. మండలంలోని పది గ్రామాలకు సంభంధించిన 23 వేల అయా గ్రామాలకు చేర్చినట్లు తెలిపారు. హద్దురాళ్లను ప్రభుత్వం ఉచితంగా అందజేస్తుందన్నారు. గ్రామానికి తరలించిన హద్దురాళ్లను భూముల వద్దకు చేరవేసి అడుగున్నర గుంత తీసి నిలబెట్టే పనికి కూడా ప్రభుత్వం నగదు చెల్లిస్తుందని తెలిపారు. ఒక్కో హద్దురాయిని తరలించి నిలబెట్టినందుకు రూ.90లు చెల్లిస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమణా నాయక్, గ్రామ సర్పంచ్ జెక్కిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, సర్వే అధికారులు పాల్గొన్నారు.